

బలహీన వర్గాలకు పెద్దపీట

బలహీన వర్గాలకు సీఎం జగన్ పెద్దపీట వేశారని ఎమ్మెల్యే శంకరనారాయణ, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ తెలిపారు. 10లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.1°/17.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.





ఉరవకొండలో బహిరంగ సభకు పూర్తయిన ఏర్పాట్లు

నేడు సీఎం జగన్ రాక

- ఉరవకొండ నుంచి వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల
- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం ఉరవకొండలోని అనంతపురం బైపాస్ సమీపంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద స్వయం సహాయక సంఘాలకు నిధులు విడుదల చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,97,850 సంఘాల్లోని 78,90,154 మంది అక్కచెల్లెమ్మలకు రూ.6,384 కోట్లు చెల్లించనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 2,41,000 మంది లబ్ధిదారులకు రూ.183.59 కోట్ల మేర సొమ్ము జమ కానుంది. ఈ సందర్భంగా సభనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. పర్యటన ఏర్పాట్లను సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ప్రోగ్రామ్ అబ్జర్వర్ ఎంఆర్‌సీ రెడ్డి,ఎమ్మెల్యే శంకరనారాయణ, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న పరిశీలించారు. వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు. వచ్చే వారికి ఆహారం, నీరు సమకూరుస్తున్నారు.

ట్రయల్ రన్ విజయవంతం

ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సోమవారం హెలికాప్టర్ ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తరలిరానున్న మహిళా లోకం

'వైఎస్సార్ ఆసరా' సభకు జిల్లా నలు మూలల నుంచి మహిళా లోకం తరలిరానుంది. ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా స్వయం సహాయక సంఘాలకు సొమ్ము విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అక్కచెల్లెమ్మలు ఘనంగా స్వాగతం పలకనున్నారు. సభను జయప్రదం చేయాలని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు.

సీఎం పర్యటన షెడ్యూల్

- ఉదయం 9 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి సీఎం జగన్ విమానంలో బయల్దేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు.
- 10 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- ఉదయం 10.40 గంటలకు అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో బయల్దేరి 10.50 గంటలకు అనంతపురం బైపాస్ సమీపంలోని బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకుంటారు.
- ఉదయం 10.55 గంటలకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పిస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడతారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఆ తరువాత వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద కంప్యూటర్ బటన్ నొక్కి సంఘాల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారు. ఆటు తరువాత మెగా చెక్ విడుదల చేస్తారు.
- మధ్యాహ్నం 12.35 గంటలకు బహిరంగ సభ వద్ద నుంచి బయల్దేరి 12.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.45 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 1.50 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 2.20 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. 2.30కు అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళతారు.





సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఆలూరి సాంబ, ఎస్పీ అన్బురాజన్, మాజీ ఎమ్మెల్యే విశ్వ

జిల్లా ఓటర్లు 19,94,544

- మహిళా ఓటర్లే అధికం

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ –2024లో భాగంగా సోమవారం ఓటర్ల తుది జాబితా వెలువడింది. ఈ మేరకు జాబితాను కలెక్టర్ గౌతమి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్వో గాయత్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. అనంతరం వివరాలను కలెక్టర్ మీడియాకు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 19,94,544 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,88,176 మంది, మహిళా ఓటర్లు 10,06,123 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 245 మంది ఉన్నారు. వీరు కాకుండా సర్వీసు ఓటర్లు (సైనికులు, వారి కుటుంబ సభ్యులు) 2,115 మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 17,947 మంది అధికంగా ఉన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా కొత్తగా 1,04,413 మంది ఓటర్లు నమోదయ్యారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లినవారికి సంబంధించి 87,529 ఓట్లను తొలగించారు. గత ఏడాది విడుదల చేసిన జాబితా ప్రకారం జిల్లాలో 19,77,660 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 19,94,544 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ప్రకారం 16,884 మంది (0.85 శాతం) ఓటర్లు పెరిగారు.

మహిళలే కీలకం

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అత్యధికంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 4,918 మంది, గుంతకల్లులో 4,352 మంది ఉన్నారు. అదే విధంగా రాయదుర్గంలో 2,646, ఉరవకొండలో 2,883 మంది, తాడిపత్రిలో 1,053 మంది, శింగనమలలో 916 మంది, కళ్యాణదుర్గంలో 1,041 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 138 మంది మొత్తం 17,947 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

నామినేషన్ వరకు దరఖాస్తు

కొత్తగా ఓటరుగా నమోదుకు రానున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా ఓటు తొలగింపునకు, ఓటరు వివరాల మార్పులకు, చేర్పులకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్

తప్పుల్లేని ఓటర్ల జాబితా

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024లో భాగంగా తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించామని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా వచ్చిన క్లెయిమ్‌లను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పరిష్కరించామన్నారు.

ఇంటి నుంచే ఓటు

దివ్యాంగులు, వయసు 80 ఏళ్లు పైబడిన వారు రానున్న ఎన్నికల్లో ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. జిల్లాలో ఎన్నికల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఓటుహక్కు కలిగిన 27,817 దివ్యాంగులను గుర్తించారు. ఇక వయసు 80 ఏళ్లు, ఆపై ఉన్నవారు 26,953 మంది ఉన్నారు.

తప్పుడు ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్

ఓట్ల తొలగింపు, తదితర అంశాలపై వచ్చిన తప్పుడు ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. మరొకటి నమోదు కావాల్సి ఉందన్నారు. అనంతపురం అర్బన్‌లో ఒక ఎఫ్ఐఆర్ నమోదయ్యిందన్నారు. కళ్యాణదుర్గానికి సంబంధించి ఒక ఫిర్యాదు నమోదు కావాలన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
రాయదుర్గం	1,29,090	1,31,736	33	2,60,859
ఉరవకొండ	1,09,905	1,12,788	30	2,22,723
గుంతకల్లు	1,31,304	1,35,656	76	2,67,036
తాడిపత్రి	1,21,499	1,22,552	24	2,44,075
శింగనమల	1,22,341	1,23,257	27	2,45,625
అనంతపురం	1,36,761	1,41,679	35	2,78,475
కళ్యాణదుర్గం	1,31,195	1,14,236	7	2,27,438
రాప్తాడు	1,24,081	1,24,219	13	2,48,313
మొత్తం	9,88,176	10,06,123	245	19,94,544

క్లుప్తంగా

విధుల్లోకి అంగన్‌వాడీలు

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె వీడి విధుల్లోకి చేరారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరవుతున్నట్లు సోమవారం ఆయా ప్రాజెక్టుల సీడీపీఓల వద్ద రిపోర్టు చేసుకున్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే అంగన్‌వాడీలకు జీతాలు పెంచారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మె వీడాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో అంగన్‌వాడీ సమ్మె వీడి విధులకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,265 మంది వర్కర్‌లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పనిచేస్తుండగా సోమవారం నాటికి 2,253 మంది విధుల్లోకి చేరారు. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. 2,027 మంది హెల్పర్లు పనిచేస్తుండగా 2,007 మంది విధులకు హాజరయ్యారు. మిగిలిన వారు అనారోగ్య కారణాలు, ప్రసూతి సెలవుల్లో ఉన్నారు.

శుభపరిణామం: కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు సోమవారం తిరిగి విధుల్లోకి చేరారు. ఇదొక శుభపరిణామమని కలెక్టర్ గౌతమి అన్నారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నుంచి అంగన్‌వాడీలకు సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

నేడు వైద్య శిబిరాలు

అనంతపురం మెడికల్: జిల్లాలోని 21 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కక్కలపల్లి కాలనీ 3, తోపుదుర్తి, డి.హొన్నూరు, తీటకల్, కొర్రపాడు 2, డీ హీరేహాల్ 2, కోటంక, కసాపురం, చాపిరి, కణేకల్లు 2, మరుట్ల, బొందలవాడ, సోరకాయలపేట, సోమనపల్లి, చిన్నవడుగూరు, కుమ్మనమల, మరూరు 2, చదమగొల్లాలదొడ్డి, వంగనూరు, ఆమిద్యాల 2, యాడికి 2 పట్టణ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలుంటాయి.

బలహీన వర్గాలకు పెద్దపీట

- శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వీరాంజనేయులు పరిచయ కార్యక్రమంలో శంకర నారాయణ, ఆలూరు సాంబశివారెడ్డి
- సామాజిక సమీకరణలో భాగంగానే సమన్వయకర్త ఎంపిక



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి (చిత్రంలో) శంకరనారాయణ, వీరాంజనేయులు, పైలా నరసింహయ్య, హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

శింగనమల: రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన వీరాంజనేయులు పరిచయ కార్యక్రమం అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సాంబశివారెడ్డి మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమైందన్నారు. సామాజిక సమీకరణల్లో భాగంగానే సమన్వయకర్తల ఎంపిక చేస్తున్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు లోబడి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సహకారంతో వీరాంజనేయులును నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. పార్టీ శ్రేణులందరిపై జగనన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో శింగనమల సెంటిమెంట్‌ను మరోమారి నిజం చేసేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. సామాజిక విప్లవంతో బడుగుల అభ్యున్నతికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగనన్న ఆశయ సాధనకు వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శంకరనారాయణ పిలుపునిచ్చారు. శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేసిన కృషిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కొనియాడారు. సామాజిక సమీకరణలో భాగంగా సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయానికి ఎమ్మెల్యే పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి కట్టుబడి ఉండడం అభినందనీయమన్నారు.

జీవితాంతం రుణపడి ఉంటా

అతి సామాన్యుడైన తనను శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపిక చేసి గురుతర బాధ్యతను అప్పగించిన సీఎం వైఎస్ జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానని వీరాంజనేయులు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అక్కున చేర్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అభినవ అంబేడ్కర్ అని కొనియాడారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రమీల, జెడ్పీటీసీలు భాస్కర్, భోగాతి ప్రతాపరెడ్డి, నాయకులు కంచిరెడ్డి భాస్కరరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంపీపీలు యోగేశ్వరి, వెంకటనారాయణ, భూమిరెడ్డి రాఘవరెడ్డి, నాగేశ్వరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ నారాయణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎం.గీత, మండల కన్వీనర్లు , సింగిల్ విండో ప్రెసిడెంట్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్కేయూకు ఐసెట్ నిర్వహణ బాధ్యత

అనంతపురం: ఏపీ ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)–2024 నిర్వహణ బాధ్యతను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. గతేడాది ఏపీ ఐసెట్‌ను ఎస్కేయూ సమర్థవంతంగా నిర్వహించిన నేపథ్యంలో తాజాగా రెండో దఫా నిర్వహణా బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఈ క్రమంలో ఏపీ ఐసెట్ చైర్మన్‌గా ఎస్కేయూ వీసీ కె.హుస్సేన్‌రెడ్డి నియమితులయ్యారు. కన్వీనర్‌గా ఎస్కేయూ ఎంబీఏ, కంప్యూటర్ సైన్సెస్, కామర్స్ విభాగాల్లో నుంచి ఓ ప్రొఫెసర్‌ను ఎంపిక చేయనున్నారు.

మహిళను ఏమార్చి నగదు డ్రా

గార్లదిన్నె: ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వచ్చిన మహిళను ఏమార్చి ఆమెకు తెలియకుండానే ఖాతాలో నుంచి నగదు డ్రా చేసుకున్న వైనం గార్లదిన్నె మండలం కల్లూరు ఎస్‌బీఐ శాఖ వద్ద చోటు చేసుకుంది. వివరాలు... కల్లూరుకు చెందిన నూర్జహాన్ రూ.10వేలు విత్ డ్రా చేసేందుకు సోమవారం ఉదయం స్థానిక ఎస్‌బీఐ శాఖ వద్ద ఉన్న ఏటీఎం వద్దకెళ్లింది. నగదు డ్రా చేసే విధానం ఆమె తెలియక పోవడంతో అక్కడే ఉన్న యువకుడి సాయం కోరింది. ఆ సమయంలో ఆమె దృష్టిని ఏమార్చి మరో కార్డును ఏటీఎంలో పెట్టి పిన్ నంబర్ కొట్టాలని చెప్పాడు. ఆమె పిన్ నంబర్ కొట్టిన తర్వాత నగదు బయటకు రాకపోవడంతో ఏటీఎం సక్రమంగా పనిచేయడం లేదని బుకాయించి బయటకు వచ్చేశాడు. దీంతో యువకుడు ఇచ్చిన ఏటీఎం కార్డును తనదిగా భావించి తీసుకున్న ఆమె అక్కడి నుంచి కెనరా బ్యాంక్ ఏటీఎం వద్దకెళుతూ తన వద్ద ఉన్న కార్డును పరిశీలించడంతో అది తనది కాదని గుర్తించి వెంటనే వెనుదిరిగి ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకుంది. అప్పటికే యువకుడు వెళ్లిపోయాడు. అతని గురించి ఆరా తీస్తుండగానే ఆమె మొబైల్‌కు రూ.10 వేలు విత్‌డ్రా అయినట్లుగా సమాచారం అందింది. వెంటనే బ్యాంకులోకి వెళ్లి అధికారులను సంప్రదించి, వారి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

సాఫీగా సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా సోమవారం అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. అనంతపురం పశు సంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ సత్యరాజ్, డాక్టర్ టి.సుధాకర్ తదితరుల నేతృత్వంలో పలువురు ఏడీలు, పశువైద్యులు, క్లరికల్ స్టాఫ్ నాలుగు బృందాలుగా ఏర్పడి సర్టిఫికెట్లు నిశితంగా పరిశీలన చేశారు. రెండు జిల్లాల పరిధిలో 473 పోస్టులకు 919 మంది అభ్యర్థులు గత నెల 31 ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యారు. డైరెక్టరేట్ పరిధిలోనే మెరిట్, రోస్టర్, కటాఫ్ మార్కుల ఆధారంగా తొలి విడతగా 206 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం 105 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన చేశారు. రెండేళ్ల కోర్సు, ఇంటర్, పదవ తరగతి, నేటివిటీ, కులం, ఉపకులం, ఆదాయం, ఆధార్ తదితర 12 రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ డేటా ఆధారంగా పరిశీలించే కార్యక్రమం సాఫీగా జరిగినట్లు జేడీలు తెలిపారు. మంగళవారం మిగతా 101 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు తెలిపారు. నిబంధనల అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యంత పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వీఏహెచ్ఏలో బదిలీల తర్వాత ఖాళీలను బట్టి కొత్త అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.


ఏహెచ్ఏ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన దృశ్యం

న్యాక్‌లో మెరుగైన గ్రేడింగ్ సాధనే లక్ష్యం

అనంతపురం: న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్)లో మెరుగైన గ్రేడింగ్ సాధనే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని సంబంధిత అధికారులకు ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి సూచించారు. న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లడానికి కాల పరిమితి దాటిన నేపథ్యంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాక్ గ్రేడింగ్‌కు సంబంధించిన అంశాలపై వర్సిటీ పాలక భవనంలో డీన్‌లు, బోర్డ్ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, విభాగాధిపతులతో సోమవారం ఆయన సమీక్షించారు. న్యాక్ గ్రేడింగ్‌కు సంబంధించిన అంశాల పర్యవేక్షణకు ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారని విభాగాధిపతులు పేర్కొనగా, వెంటనే వారిని తప్పించి వర్సిటీ ఉన్నతాధికారులే బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నా.. వర్సిటీ వెబ్‌సైట్‌లో తాజా సమాచారం పొందుపరచకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పీజీ అడ్మిషన్ల పెంపుదలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. అలాగే పీజీ తరగతులు నిర్వహించని ప్రొఫెసర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అత్మకూరు: మండల కేంద్రంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భక్తి శ్రద్ధలతో భూమి పూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆత్మకూరు ఎంపీపీ సుబ్బర హేమలత, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంతమ్మ హాజరయ్యారు. తొలుత వాల్మీకి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు.

ప్రజలు గర్వంగా చెప్పుకునేలా అభివృద్ధి

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు సగర్వంగా చెప్పుకునేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని బీసీ కాలనీలో 40 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, ఆర్‌బీకే వద్ద 10 లక్షల లీటర్ల నీటి సంప్ ఏర్పాటు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేసి, మాట్లాడారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు శాశ్వత నీటి పరిష్కారం చూపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రూ.95 కోట్ల నిధులతో పీఏబీఆర్ నుంచి చేపట్టిన పనులు శరవేగంగా సాగుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో పనులు పూర్తయి తుంగభద్ర జలాలు అందుతాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత మురళిని పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, ఉప సర్పంచ్ దైవులశివారెడ్డి, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ లక్ష్మీనరసింహులు, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మధు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, నాయకులు వెంకటేష్, చిన్న ఆంజనేయులు, నాగరాజు, రామాంజి, సోము, వెంకట్రాముడు, మల్లన్న, ప్రసాద్, సింగంపల్లి వెంకటేష్ రామాంజి, జయరాం, తిమ్మయ్య, శ్రీరామ్, బుటారు లక్ష్మన్న, టీబీ టైలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ

డివిజన్ అభివృద్ధికి కృషి

- నూతన డీఆర్ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: ఉద్యోగులందరినీ కలుపుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన వినీత్‌సింగ్ పేర్కొన్నారు. డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌ను సెంట్రల్ రైల్వేలోని నాగపూర్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో భువనేశ్వర్ జోన్‌లోని సంబల్‌పూర్ డీఆర్ఎంగా పనిచేస్తున్న వినీత్ సింగ్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం మనీష్ అగర్వాల్ నుంచి గుంతకల్లు డీఆర్ఎంగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం డివిజనల్ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్ స్థితిగతులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


మనీష్ అగర్వాల్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి

- మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా మహిళల జీవనోపాధుల మెరుగుకు కృషి చేయాలని మెప్మా అధికారులు, సిబ్బందిని మెప్మా మిషన్ డైరెక్టర్ (ఎండీ) విజయలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఏడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా మెప్మా అధికారులు, సీఓలు, ఆర్‌పీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. తొలుత వైఎస్సార్ ఆసరాపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో 11,773 సంఘాలకు నాలుగు విడతల్లో రూ.354.27 కోట్లు జమ అవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగో విడతకు సంబంధించి అనంతపురం జిల్లాలోని 7,137 సంఘాల సభ్యులకు రూ.53.16 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలోని 4,726 సంఘాలకు రూ.35.34 కోట్లు జమ అవుతున్నట్లు తెలిపారు. మహిళలు మరింత ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఈ–మార్ట్‌లు, పట్టణ ప్రగతి యూనిట్లు, జగనన్న అర్బన్ మార్కెట్లు, జగనన్న మహిళా మార్ట్‌లు, ఆహా క్యాంటీన్ల ఏర్పాటుపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న మెప్మా ఎండీ విజయలక్ష్మి

ఆర్‌ఎస్‌ఐలకు స్థాన చలనం

అనంతపురం క్రైం: కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలోని 49 మంది ఆర్‌ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 19 మంది ఉన్నారు.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి బదిలీ వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత జిల్లా	బదిలీ జిల్లా
బి.స్వామి నాయక్	వైఎస్సార్ జిల్లా	అనంతపురం
ఎస్.జాఫర్	అన్నమయ్య	అనంతపురం
కె.ప్రవీణ్‌కుమార్	అనంతపురం	చిత్తూరు
ఎం.బాలాజీనాయక్	అనంతపురం	చిత్తూరు
ఎస్.మక్బూల్	అనంతపురం	చిత్తూరు
ఎం.రమేష్‌నాయక్	అనంతపురం	చిత్తూరు
కె.ముస్తఫా	అనంతపురం	చిత్తూరు
బి.హెచ్.బి.ప్రదీప్‌సింగ్	శ్రీసత్యసాయి	తిరుపతి
బత్తిని రాజు	శ్రీసత్యసాయి	తిరుపతి
కోడూరు వెంకటేశ్వరరావు	శ్రీసత్యసాయి	అన్నమయ్య
జె.లక్ష్మణ	శ్రీసత్యసాయి	తిరుపతి
పి.ప్రసాద్	శ్రీసత్యసాయి	తిరుపతి
జి.గోపాల్	చిత్తూరు	అనంతపురం
జి.ఫజులుద్దీన్	చిత్తూరు	అనంతపురం
షేక్ ఇమామ్ ఖాసీం	తిరుపతి	శ్రీసత్యసాయి
బి.మల్లిక	తిరుపతి	శ్రీసత్యసాయి
పి.త్యాగరాజు నాయుడు	తిరుపతి	శ్రీసత్యసాయి
కె.లక్ష్మీపతి	తిరుపతి	శ్రీసత్యసాయి
టి.వి.రామకృష్ణ	తిరుపతి	శ్రీసత్యసాయి

పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు తప్పనిసరి

- జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

కూడేరు: పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. కూడేరు మండలం గొటుకూరు, కమ్మూరు, మరుట్ల, ,జలిపల్లి, ఉదిరిపికొండ, కొర్రకోడు, ముద్దలాపురం, అరవకూరు, కొర్రకోడు డ్యాం, శివరాం పేట, కూడేరు గ్రామాల్లోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. గదుల్లో వెలుతురు, విద్యుత్ సౌకర్యంతో పాటు తాగునీటి సౌలభ్యంపై ఆరా తీశారు. మౌలిక వసతుల్లేని బూత్‌లను గుర్తించి వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


గొటుకూరులో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జేసీ కేతన్ గార్గ్

చంపుతానని బెదిరిస్తున్నాడు

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

అత్మకూరు: 'నాకు చాలా అప్పులు ఉన్నాయి. అప్పుల బాధ ఎక్కువైంది. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక నా భూమి అమ్మి అప్పులు చెల్లించాలనుకుంటే పరిటాల కుటుంబం అండ చూసుకుని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరుశురామ్ నన్ను చంపేందుకు కుట్ర చేస్తున్నాడు' అంటూ బి.యాలేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బండి నాగరాజు వాపోయాడు. ఇందుకు సంబంధించి సెల్ఫీ వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. వీడియోలో బండి నాగరాజు మాట్లాడుతూ... 'ఎస్పీ సార్‌కు నా విన్నపం. నా భూమి అమ్ముతుంటే బండి పరశురామ్ అడ్డుపడుతూ పలుమార్లు నన్ను చంపడానికి ప్రయత్నించాడు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశా. ఇప్పటికే బండి పరుశురామ్‌పై చాలా కేసులున్నాయి. పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత, బాలాజీ అండ చూసుకుని నన్ను చంపుతానంటూ బెదిరిస్తున్నాడు. మా తాతకు ఐదుగురు కుమారులు ఉండగా... మా నాన్న నాల్గోవాడు. రెండవ వ్యక్తి ముసలన్న కుమారుడే బండి పరుశురామ్. నాకు పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని ఆక్రమించుకునేందుకు పరుశురామ్ ప్రయత్నిస్తున్నాడు. కురుబ కుల పెద్దలు జోక్యం చేసుకుని నాకు న్యాయం చేయాలి. నాకున్న అప్పులు తీర్చుకునేందుకు నా భూమిని అమ్ముతున్నాను. పరుశురామ్ ఆగడాలను ఆపకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం. నాకు ఎలాంటి హాని జరిగినా బండి పరుశురామే కారణమవుతాడు' అంటూ ఎస్పీ అన్బురాజన్, కురుబ కులస్తులకు సెల్ఫీ వీడియో ద్వారా నాగరాజు అభ్యర్థించాడు.


వీడియోలో మాట్లాడుతున్న బండి నాగరాజు

రూ.10 లక్షల పట్టివేత

విడపనకల్లు: ఆంధ్ర సరిహద్దులో విడపనకల్లు మండలం హావళిగి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల నగదు పట్టుబడింది. వివరాలను సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప వెల్లడించారు. సోమవారం ఉదయం కర్ణాటక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని హావళిగి చెక్ పోస్టు వద్ద చెక్‌పోస్టు సిబ్బంది, పాల్తూరు పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి దాఖలాలు లేకుండా తరలిస్తున్న రూ.10 లక్షలు బయటపడింది. నగదు తరలిస్తున్న కర్ణాటకకు చెందిన చాకలి వీరభద్రప్పను అదుపులోకి తీసుకున్నారు. నగదుతో పాటు వాహనాన్నీ సీజ్ చేశారు. తనిఖీల్లో పాల్తూరు ఎస్ఐ తిప్పయ్య, ఎక్సైజ్ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న పోలీసులు

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి


కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అందిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్

అనంతపురం అర్బన్: వక్ఫ్‌బోర్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమికి వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్ విన్నవించారు. కలెక్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లోని ప్రత్యేక చాంబర్‌లో రిజ్వాన్ కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలోని 10 వేలు ఎకరాల్లో ఎక్కువ భాగం అన్యాక్రాంతమయ్యాయని, వీటిని రక్షించాల్సిన బాధ్యత బోర్డుపై ఉందన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారిగా ఆర్‌డీఓ ఉన్నారని, ప్రతి నెలా బోర్డు కమిటీ సమావేశం నిర్వహించేలా చూడాలని కోరారు. మరిన్ని సమస్యలు కలెక్టర్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

'స్పందన'కు 63 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 63 వినతులు అందాయి. ఓటర్ల తుది జాబితా విడుదల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం రద్దు చేశారు. అయినప్పటికీ అర్జీలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. దీంతో వారిని వెనక్కి పంపించకుండా స్పందన సిబ్బంది అర్జీలు స్వీకరించారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపుతామని స్పందన ఇన్‌చార్జ్ మారుతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు మెటీరియల్ పంపిణీ


ప్రధానోపాధ్యాయులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

కనగానపల్లి: మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలకు సోమవారం పరీక్షల మెటీరియల్, గ్రంథాలయ పుస్తకాలు, బైజూస్ ట్యాబ్‌లు, టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, ప్రధానోపాధ్యాయులు నజీర్, నాగేంద్ర, భ్రమరదేవి, బాబు, బాషా, శివయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి


ఉమానగర్‌లో కులగణనపై ఆరా తీస్తున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కులగణన పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. సోమవారం నగరంలోని ఉమానగర్, మున్నానగర్, విద్యుత్‌నగర్, బోయ వీధి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న కులగణన సర్వేను అదనపు కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు. సర్వే ఏవిధంగా చేపడుతున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరంలో మెడికోల ప్రతిభ


మెడికోలను అభినందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత శిబిరంలో ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు ప్రతిభ చూపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు భారత ప్రభుత్వ యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రీజనల్ డైరెక్టరేట్ హైదరాబాద్ ఎన్‌ఎస్‌ఎస్ శాఖ మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు ఎజీ పరిణీతసాయి, ఎం.సాయిసుష్మ, వీ విద్యాసాగర్, కే నాగయశ్వంత్ ప్రతిభ చూపారు. సోమవారం వైద్య కళాశాలలో మెడికోలను ప్రిన్సిపాల్ మాణిక్యరావు అభినందించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పాల్గొన్నారు.

అంతా రామమయం

- వాడవాడలా ఉట్టిపడిన భక్తిభావం
- బాలరాముడి ప్రాణ ప్రతిష్టను వీక్షించిన ప్రజలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీరామ నామం మార్మోగింది. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకొని నగరంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్‌లోని సీతా రామాంజనేయ దేవస్థానంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని, 71 రకాల నైవేద్యాలను భక్తులకు అందజేశారు. 11 కేజీల లడ్డూను స్వామికి నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, అవోప మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరు అనురాధ, సభ్యులు చంద్రకళ, ఇందిరా, రాంప్రసాద్, ఈశ్వరయ్య, ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలో వలీ స్వామి ఆశ్రయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలోని ననకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త గురుశేఖర్‌బాబు, ఆలయ పూజారి గిరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తూరు వాసవీ ఆలయం నుంచి నగర వీధుల్లో శ్రీరాముడి నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గోపా నరసింహులు, నాయకులు వెంకటేశ్వర్లు, మనోజ్, నాగభూషణ, మల్లికార్జున, క్రిష్ణం, రఘు, తల్లం మురళీ, జయం సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పాతూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మూడురోజులుగా శ్రీరామనామ సంకీర్తన నిర్వహించారు. బుశెట్టి రమణమూర్తి, ఆర్యవైశ్య సంఘం నాయకులు రత్నం, సత్యనారాయణ, రవీంద్రనాథ్, నాగరాజు, సాయినాథ్, కుమార్, కొండా, నాగేంద్రప్రసాద్, శ్రీనివాసులు, శ్రీధర్, దేవరకొండ కౌసల్య, నాగమణి, నరసయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.
- లక్ష్మీనగర్‌లోని కోదండరామాలయంలో భజనలు చేశారు. బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్ష కార్యక్రమం ద్వారా వీక్షించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయి ట్రస్టు నిర్వాహకుడు విజయసాయి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి, సోమనాథ్‌నగర్, తపోవనం తదితర ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. తపోవనంలోని శివశక్తి సాయి ఆలయంలో ఉదయం సుప్రభాతం, నగర సంకీర్తన, నదీజలాలతో అభిషేకం, స్వామిని ఊరేగించారు.
- పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అఖండ రామనామ సంకీర్తన భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తలు న్యాయవాది గురుప్రసాద్, రంగాచారి, కమిటీ సభ్యులు ప్రకాష్, నాగభూషణం, బాలాచారి, చంద్రమౌళి, కృష్ణమాచారి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ వేడుకను వీక్షించడానికి వచ్చిన నగరవాసులు

'అనంత'లోనూ అయోధ్య రాముడికి పూజలు

అనంతపురం కార్పొరేషన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట వేళ నగరంలో పూజలు పెద్ద ఎత్తున చేశారు. కులమతాలకతీతంగా సోదరభావంతో పూజలు చేసుకున్నారు. 43వ డివిజన్ 4,5వ రోడ్డులో జరిగిన శ్రీరాముడి పూజా కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇసాక్ పాల్గొని, పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రజలకు అన్నదానం చేశారు. జై శ్రీరామ్ ఉన్న జెండాను పట్టుకొని నినాదాలు చేశారు. అదేవిధంగా వివిధ పాఠశాలల్లో చిన్నారులు బాల రాముని వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకున్నారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండలంలోని 16 గ్రామా పంచాయతీల్లో రామాలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మరూరులో చిన్న కదిరయ్య స్వామి, హంపాపురంలో 39 అడుగుల అభయాంజనేయ స్వామి, చిన్మయనగర్‌లో వెంకటేశ్వరస్వామి, శివాలయం, రాప్తాడులో రాముని ఆలయాల దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు తలపై వేసుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయాల దగ్గర భక్తులకు అన్నదానం చేపట్టారు. రాప్తాడులో రామాలయం దగ్గర అన్నదాన కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు గొంది అశోక్ కుమార్ రూ.10,116 పంపిణీ చేశారు.

శ్రీరాముడి ఆలయాల్లో పూజలు

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం సీతారాముడి ఆలయాల్లో స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామునికి, సీతాదేవికి, లక్ష్మణుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆత్మకూరు,పి.యాలేరు, వడ్డుపల్లి, పంపనూరు, సనప , తోపుదుర్తి గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఆర్యవైశ్య సంఘం నాయకుడు తిరువీధులు


రాప్తాడులో రామాలయం దగ్గర అన్నదానం చేస్తున్న దృశ్యం


ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో సీతారామ,లక్ష్మణుల విగ్రహం


పాపంపేటలో శ్రీరాముడు వేషధారణలో చిన్నారి


ఆత్మకూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం


దీక్షిత, ఉమామహేశ్వరిని సన్మానిస్తున్న సాయి ట్రస్ట్ నిర్వాహకులు


పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో


శ్రీరాముడి చిత్ర పటం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు



అనంతపురంలో ఇళ్లల్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


నగరంలో రాముడి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు


లక్ష్మీనగర్‌లో రామమందిర ప్రారంభోత్సవ వేడుకను ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న భక్తులు


హెచ్చెల్సీ కాలనీ ముత్యాలమ్మ ఆలయంలో...

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ప్రభుత్వ గోడౌన్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను దగా చేసిందని, కనీసం రైతులపట్ల ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ సేవలు అందిస్తోందన్నారు. రైతులకు అన్నివిధాలా ఆయా కేంద్రాల్లో సౌకర్యంగా మందులు, విత్తణాలు, అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాబోవు రోజుల్లో రైతులు, ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కడతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, సర్పంచ్ నా గరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే బడుగులకు న్యాయం

చెన్నేకొత్తపల్లి: బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో అందరివాడు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సమన్వయ కర్త శాంతమ్మ, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, అందరివాడు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

- కుట్ర రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


నగరంలోని మహదేవ నగర్‌లో అభివృద్ధి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నగరానికి దీటుగా పంచాయతీలను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి అక్రమాలతోనే సాగిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రజల సొమ్మును దోచుకున్న ఘనుడని మండిపడ్డారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఏ, నారాయణపురం, రాజీవ్‌కాలనీ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీదే అధికారం:

టీడీపీ, జనసేనతో పాటు ఎన్ని పార్టీలు జతకట్టినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే అధికారమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలను మోసం చేసిన పార్టీలు ఒక వైపు ఉంటే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ఓ వైపు ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన సమయంలో ఎక్కడా చూసినా సమస్యలే కనిపించేవన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నారాయణపురం, రాజీవ్‌కాలనీ పంచాయతీల్లో దాదాపు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాజీవ్‌కాలనీ పంచాయతీని దత్తత తీసుకున్నానని మాజీ ప్రజాప్రతినిధి ఉత్తమాటలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. టీడీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రాజీవ్ కాలనీలో గతంలో జరిగిన అభివృద్ధి ఇప్పుడు జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. కాలనీ ఏర్పడి నలభై ఏళ్లు అవుతున్నా జరగని అభివృద్ధి.. నాలుగేళ్లలోనే అభివృద్ధి చేశామన్నారు. మెయిన్ బ్రిడ్జితో పాటు ప్రియాంకనగర్ బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీటీసీలు నాగేంద్ర, శృతి, సంధ్యా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ హుస్సేన్, నాయకులు మల్లెల వేణుగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి, రహీం, అంజి, మనోజ్, వలీ, పురుషోత్తం రెడ్డి, రామాంజనేయులురెడ్డి, లక్ష్మీనారాయణ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యపు పంటలు విస్తృతంగా సాగు చేయాలి

- మిల్లెట్ మేళా ముగింపు కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ


మిల్లెట్ మేళాలో పాల్గొన్న డీఏవో ఉమామహేశ్వమ్మ, ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: సమాజం, వ్యవసాయంలో వస్తున్న మార్పులకనుగుణంగా చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకొస్తే ప్రోత్సహిస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఏఎఫ్ ఎకాలజీ, ఆర్డీటీ, రెడ్స్, కార్డు, పీఎంఎఫ్ఎంఈ, ఏపీ మాస్, ఎర్త్ 360, సీఎస్ఏ తదితర 16 ఎన్‌జీవోలు సంయుక్తంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎగ్జిబిషన్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'మిల్లెట్ మేళా' సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఏవో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు పూర్వవైభవం తీసుకొచ్చే క్రమంలో ఐక్యరాజ్య సమితి 2023 ఏడాదిని ఇంటర్నేషనల్ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించినట్లు గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా గత ఖరీఫ్, రబీలో 'మిషన్ మిల్లెట్' పేరుతో రాగి, కొర్ర, జొన్న, ఆరికలు, సామలు, ఊదలు తదితర సంప్రదాయ చిరుధాన్యపు పంటల విస్తీర్ణం పెంపునకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ తరహా పంటల సాగును ప్రోత్సహిస్తూ 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తోందన్నారు. మద్దతు ధరతో కొనుగోళ్లకు కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాసెసింగ్, మార్కెటింగ్, వినియోగం పెరిగితే పంటల సాగు, దిగుబడులు పెరిగి రైతులకు లాభదాయకమవుతుందని తెలిపారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆరోగ్యం..

పర్యావరణం, ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని వర్గాల ప్రజలు చిరుతిళ్లు, వీటి ఆహారోత్పత్తులను తమ రోజువారీ ఆహారంలో తీసుకునేందుకు ముందుకు రావాలని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. 50 ఏళ్ల కిందట వ్యవసాయ పద్ధతులు, ప్రజల జీవన విధానాన్ని గుర్తు చేశారు. చిరుధాన్యాల ఉత్పత్తులతో మానవుడు సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించే నిమిత్తం పలు ఎన్‌జీవోలను ఒకతాటిపైకి తీసుకొచ్చి మిల్లెట్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. మూడో రోజు కూడా నగరవాసులు, ఎన్‌జీవోల తరపున పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు తరలివచ్చారు. కళాకారులు కోలాట, చెక్కభజన, జానపద గీతాలతో అలరించారు. ఎన్‌జీవోలు, కళాకారులకు మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ బి.రఘునాథరెడ్డి, విశ్రాంత కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.లక్ష్మిరెడ్డి, రెడ్స్ భానుజ, కార్డు నిర్మలారెడ్డి, నాయక్, మురళీ, పార్థసారథి, ఆదినారాయణ, నరేంద్ర, శంకర్, విజయభాస్కర్, రామప్ప, బలరాం తదితర ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి


అనంతపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన చిక్కీలు ఇవ్వాలని ఆహార భద్రత సలహా మండలి సభ్యులు గుజ్జల లక్ష్మణ్ కుమార్ అన్నారు. కురుగుంట పరిధిలోని రియశ్రీ ఆగ్రో ఫుడ్ ప్రైవేట్ చిక్కీ తయారీ కేంద్రాన్ని ఫుడ్ అడ్వయిజర్ కమిటీ మెంబర్ గుజ్జల లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తోందన్నారు. చిక్కీలు తయారీలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఎల్ఎం ఉమాదేవి, కార్యదర్శి రమ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి రమ పాల్గొన్నారు. ఎల్ఎం ఉమాదేవి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి రచనలకు ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతి గ్రాంథిక పుస్తకాన్ని తెలుగులో అనువదించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, బాషా, ఉజ్జినేశ్వరి, సరస్వతమ్మ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

- ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మంజుల



రాప్తాడు కూడలిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ అలీంతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

రాప్తాడు: ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు రాప్తాడు మీదుగా కాకుండా 44వ జాతీయ రహదారి రుద్రంపేట మీదుగా, గంగలకుంట, పంగల్ రోడ్డు మీదుగా అనంతపురానికి వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య చికిత్సల కోసం బెంగళూరుకు వెళ్తున్న రోగులు రాప్తాడులో నాలుగు రోడ్ల కూడలిలోనే బస్సులు నిలుపుతుండడంతో కిలో మీటరు దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీనిపై రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్‌తో కలిసి స్థానికులు విషయాన్ని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రయాణికురాలు కాదు..ప్రగతి రథ సారథి

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల మండలంలోని మరూరు టోల్ ప్లాజా దగ్గర బెంగళూరు నుంచి అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి బస్సులోనే ప్రయాణించారు. బస్సు రాప్తాడు మీదుగా కాకుండా బైపాస్ గంగలకుంట రోడ్డు మీదుగా అనంతపురం వెళ్లేందుకు బస్సును డ్రైవర్ తిప్పడంతో.. బస్సులో ప్రయాణికురాలుగా కూర్చున్న ఆమె..సీట్లో నుంచి లేచి ఆర్టీసీ సిబ్బందిని ప్రశ్నించారు. 'నా పేరు మాల్యవంతం మంజుల, నేను ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌ని..రాప్తాడు మీదుగా బస్సు ఎందుకు వెళ్లడంలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డ్రైవర్ ఇది హైటెక్ సర్వీస్, ఇదే రూట్‌లో వెళ్లాలని సమాధానం చెప్పడంతో.. హైటెక్ బస్సు ఎందుకు రాప్తాడు మీదుగా వెళ్లకూడదు..రాప్తాడు వాసులకు హైటెక్ బస్సులో ప్రయాణించే యోగ్యత లేదా ? అని ప్రశ్నించారు.

బస్సులు బైపాస్ మీదుగా వెళ్తే చర్యలు..

ఆర్టీసీ బస్సులు రాప్తాడు మీదుగా కాకుండా బైపాస్ మీదుగా వెళ్తే చర్యలు తప్పవని ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె రాప్తాడు సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిల్చొని దాదాపు గంట సేపు వేచి చూశారు. ఆసమయంలో అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గంగలకుంట రోడ్డు - బైపాస్ మీదుగా రాప్తాడు నాలుగు రోడ్ల కూడలికి చేరింది. వెంటనే ఆమె హిందూపురం బస్సును ఆపి ఎందుకు రాప్తాడు మీదుగా రావడం లేదని, బైపాస్ మీదుగా వస్తున్నారని డ్రైవర్ అలీమ్, కండక్టర్ నాగరాజును ప్రశ్నించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఆర్ఎంలు సుమంత్ ఆర్ ఆదోని, మధుసూదన్‌తో ఆమె మాట్లాడారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, మన్నల రవి కుమార్, నాగరాజు, రామకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.